క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం మణికంఠ భక్త బృందం ఆధ్వర్యాన అయ్యప్పస్వామి జన్మదిన మహోత్సవాలు, మణికంఠ చారిటబుల్ సొసైటీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, 9 గంటలకు స్వామి వారికి విశేషంగా అభిషేకం, 18 కలశములతో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయకమిటీ సభ్యులు బల్లెం పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షించారు.

మధురానగర్ ఆర్‌యూబీ పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ స్థితిగతులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం పరిశీలించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి మధురానగర్ రైల్వే గేటు వైపు నిర్మాణంలో వున్న ఆర్‌యూబీకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బీటీ సర్వీస్ రోడ్డును పరిశీలించారు. రైల్వే గేటు నుంచి వచ్చే వాహనాలు మరింత సులువుగా ప్రయాణిండానికి వీలుగా రైల్వే గేటు వద్ద గల రైల్వే కేబిన్ లను పక్కకు జరపడానికి రైల్వే శాఖ అధికారులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. రైల్వే గేటు మధురానగర్ స్టేషన్‌కు గల మలుపులో ఆటోలు నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని కావున అక్కడ ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకోవటానికి పోలీసు శాఖ వారిని సంప్రదించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

దుర్గగుడిలో మహిళా దినోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈవో భ్రమరాంబను చైర్మన్ రాంబాబు సత్కరించారు. పలువురు మహిళా ఉద్యోగులు సైతం ఈవోను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఈఈ ఎల్.రమ, ఏఈవో పి.సుధారాణి, పర్యవేక్షకులు లక్ష్మీ ప్రసన్న, హేమ దుర్గాంబ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, ఉద్యోగులు, ఆలయ సెక్యూరిటీ సూపర్‌వైజర్ సాయి, ఇతర అధికారులు ఉన్నారు.

వన్‌టౌన్‌లో సందడిగా హోలీ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాతబస్తీలోని అన్ని వీధుల్లో బుధవారం హోలీ వేడుకల సందడి దర్శనమిచ్చింది. ప్రధానంగా వన్‌టౌన్‌లోని కేటీరోడ్డు, బ్రాహ్మణవీధి, సింగరాజువారివీధి, సుబ్బరామయ్యవీధి తదితర ప్రాంతాల్లో యువత ఉత్సాహంగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు రోడ్లపై తిరుగుతూ తమ స్నేహితులపై రంగులు చల్లుతూ హడావుడి చేశారు. ప్రధానంగా ఉత్తర భారతీయ కుటుంబాలే కాకుండా తెలుగువారు సైతం అత్యధికంగా ఈ వేడుకల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. కొత్తపేటలోని పలు అపార్ట్‌మెంట్లలో ప్రత్యేకంగా వాద్యాలతో సందడి చేస్తూ అపార్ట్‌మెంట్ వాసులందరూ పాల్గొన్నారు. వెలగలేటివారివీధిలోని అపార్ట్‌మెంట్స్‌లోనూ అదే తరహా సందడి కొనసాగింది. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు ఇచ్చిపుచ్చుకున్నారు. ప్రధానంగా చిన్నారులు, యువకులు బృందాలుగా తిరుగుతూ రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే, మేయర్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లంబాడీపేటలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయనభాగ్యలక్ష్మి పాల్గొన్నారు. సాయిరాం థియేటర్, జారుబండ రోడ్డు, కేటీ రోడ్డుపై స్థానికులు నిర్వహించిన వేడుకల్లో పాల్గొని రంగోలి నృత్యాలకు ఆడిపాడారు. అనంతరం స్థానికులకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, నగర మేయర్‌లు మిఠాయిలను పంపిణీ చేశారు.

మహిళల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- పార్టీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించిన దృశ్యం



డెప్యూటీ మేయర్, మహిళా కార్పొరేటర్లతో కలిసి కేకు కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. భవానీపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నగర మేయర్ భాగ్యలక్ష్మీ, వెలంపల్లి శ్రీనివాసరావు మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళా కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైఎస్ చైర్మన్లను సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో జగనన్న పని చేస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ ప్రతి సంక్షేమ పథకం ద్వారా కలిగే లబ్ధిని వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో 31 లక్షల మంది మహిళలకు ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు కడుతున్నారన్నారు.

మహిళలను కించపరిచిన చరిత్ర బాబు, పవన్‌లది..

పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో మహిళలను కించపరుస్తూ మాట్లాడారన్నారు. నేను 3 పెళ్లిళ్లు చేసుకున్నా. మొదటి ఇద్దరికీ భరణం ఇచ్చాను. కావాలంటే మీరు కూడా చేసుకోండి అని మహిళలను అవహేళన చేశారన్నారు. చంద్రబాబు మహిళలను కించపరుస్తూ మాట్లాడిన మాటలు సిగ్గు చేటన్నారు. కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అంటూ వివక్ష పూరితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మహిళలను కించపరిస్తే నేడు జగనన్న మహిళకు పెద్ద పీట వేసి వారి సాధికారతకు అడుగులు వేస్తున్నారన్నారు. శాసన మండలి ఉపాధ్యక్షురాలుగా, రాష్ట్ర హోం మంత్రిగా మహిళలను నియమించి వారిని గౌరవించారన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గా, మహిళ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి రజని, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సంపత్ విజితా, ఎంపీపీ కోటేరు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక రామకృష్ణాపురం ఆర్‌ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో కార్పొరేటర్ బి.జానారెడ్డి ఆధ్వర్యాన బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విష్ణు హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్ బి.జానారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నారు. అనంతరం 74 సంవత్సరాల వయస్సులో కృష్ణానదిలో ఈత కొట్టిన సుబ్బలక్ష్మి, అజిత్ సింగ్‌నగర్ ఎస్ఐ దుర్గాదేవి, ఈఎస్ఐ హాస్పిటల్ ఫార్మసిస్ట్ కళ్ళేపల్లి పార్వతి, ఇందిరా మహిళా మండలి కె.మాధవిలత, నూకతోట రజని, మద్ది రమాదేవి, ఆర్‌వీ తులసీరత్నం, సుధారాణి, ఎస్.భాగ్యరేఖ, శారదావాణి, పద్మశ్రీ, రాణి తదితరులను సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, జి.శ్రీను, అమ్ముల రవి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో సత్కార గ్రహీతలతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్‌లో..

మధురానగర్ భగవాన్ షిరిడీసాయిబాబా మందిరంలో బుధవారం తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి ఆర్ట్స్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, హస్తకళ సేవా మహిళా శిరోమణి ఖడ్గరాజు మీనాక్షి, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి సభ్యులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా తొలితెలుగు దివ్వె అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీ తులసి మాట్లాడారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, తొలితెలుగు దివ్వె వ్యవస్థాపకులు పీవీఎల్‌ఎన్ రాజు పాల్గొని మహిళల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షులు వైవీ శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం అందరి బాధ్యత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ సృష్టికి మూలం మహిళ అని... మహిళలను గౌరవించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ఈ భూమండలం మీద మానవ సృష్టి ఉందంటే దానికి మూలం మహిళే అని, మహిళ లేకుంటే సృష్టే లేదన్నారు. మహిళలతో కలిసి కేకు కట్‌చేసి, కార్పొరేటర్ షాహీనాసుల్తానా, పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, కొండా జయలక్ష్మీ, పలు విభాగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

మహిళలకు అధిక ప్రాధాన్యం – ఎమ్మెల్యే మల్లాది విష్ణు.

రాష్ట్రంలో మహిళలకు జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, అక్కచెల్లెమ్మలు ఆర్థిక స్థిరత్వం సాధించేందుకు అవసరమైన అన్ని మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, సెంట్రల్ నియోజకవర్గంలోని మహిళా కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులను ఆయన సన్మానించారు.

ఎంబీ స్టేడియంలో..

మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాలు పాల్గొని పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, ఎస్‌బీజీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

విజయవాడ కల్చరల్: సువర్ణమణి రిధమ్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, మల్లాది స్వాతి, వై.అమలారాణి, కంచి మల్లీశ్వరిను సత్కరించారు. సంస్థ నిర్వాహకుడు మానేపల్లి జోషి, మాలపాటి వెంకటరమణ, బీవీ వీరభద్రరావు, జిలానీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. నవోదయ విద్యాసంస్థల అనుబంధ సంస్థ సిద్ధార్థ పాఠశాలలో సత్యనారాయణపురం బ్రాంచ్‌లో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. తల్లులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎ.శ్రీధరరెడ్డి, విద్యాసంస్థ వైస్ చైర్మన్ బి.మాధవీ రెడ్డి పాల్గొన్నారు.



మధురానగర్‌లో సత్కార గ్రహీతలు

మహిళలకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్‌లోని ఎస్ఎస్ఎస్ బొటెక్, గార్మెంట్స్ వివిధ స్వయం ఉపాధి కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ రేస్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆప్కో జనరల్ మేనేజర్ తనూజారాణి, ధూపాటి శ్రీదేవి, ఎన్‌వీ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు 64వ డివిజన్లో గడప గడపకు మన ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): 64వ డివిజన్ 285వ వార్డు సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, పార్టీ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి స్పోర్ట్స్ మీట్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నేటి నుంచి మూడు రోజుల పాటు 33వ డివిజన్ సత్యనారాయణపురంలో స్పోర్ట్ మీట్–2023 నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఏకేటీపీ నగర పాలక సంస్థ పాఠశాల మైదానం, ఇండోర్ స్టేడియంలో జరిగే ఆటల పోటీల్లో సచివాలయ అడ్మిన్‌లు, సెక్రటరీలు, వలంటరీలు పాల్గొంటారని తెలిపారు. 11వ తేదీ సాయంత్రం జరిగే ముగింపు వేడుకల్లో రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రెయిన్లలో చెత్త లేకుండా చూడాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైడ్ డ్రెయిన్లలో చెత్తా చెదారం, మురుగు నిల్వ ఉండకుండా చూడాలని 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్ అన్నారు. డివిజన్ పరిధిలోని సీతన్నపేట జామి అప్పన్న స్ట్రీట్. మీసాల వారి స్ట్రీట్. నాగమ్మ వారి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించారు. పార్టీ 36వ డివిజన్ ప్రెసిడెంట్ పూలపా కృష్ణ, 27వ డివిజన్ ప్రెసిడెంట్ కురిటి శివ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు బందెల రామకోటయ్య మృతి



మధురానగర్: సీపీఐ సీనియర్ నాయకుడు బందెల రామకోటయ్య (80) బుధవారం ఉదయం మృతి చెందారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడిగా కార్మిక హక్కుల సాధనకు ఆయన పోరాడారు. పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేశారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, నాయకులు డీబీకే రావు, సీతారావమ్మ, శ్రీధర్, కొరగంజి దుర్గాంబ, వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందరపాల్, సీపీఎం నాయకులు సీహెచ్ బాబూరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

నేడు వీఎంసీ బడ్జెట్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 2023–24 వార్షిక బడ్జెట్ అంచనాలపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో 2023–24 ఏడాదికి ఆదాయాలు రూ.1373.26 కోట్లు కాగా అందులో రెవెన్యూ ఆదాయం రూ.859.12 కోట్లు, క్యాపిటల్ ఆదాయం రూ. 444.43 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు రూ.69.71 కోట్లు అంచనాలు పొందుపరచారు. ఖర్చుల్లో రెవెన్యూ ఖర్చు రూ. 697.76 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ. 634.31 కోట్లు, లోన్లు, రీపేమెంట్లు రూ. 18.12 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులు రూ. 69.71 కోట్లు మొత్తం కలిపి రూ.1419.90 కోట్ల అంచనాల బడ్జెట్‌పై వీఎంసీ కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు సమావేశంలో చర్చించనున్నారు.

సమానత్వంతోనే సన్మార్గంలో సమాజం

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): త్యాగానికి, సహనానికి, ఓర్పు, నేర్పుకు మారుపేరైన మహిళలకు పాలనాధికారం లభిస్తే అవినీతి దానంతటదే అంతం అవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో బుధవారం బర్త్‌రైట్ బై రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల్లో 50 శాతం మహిళలు ఉంటే సమాజం సన్మార్గంలో నడుస్తుందని చెప్పారు. ఆడపిల్లలు కుటుంబానికి భారం అనే భావన సమాజంలో పూర్తిగా పోవాలన్నారు. ప్రజల ఆలోచనలలో సమూల మార్పుతో పాటు మరింత బలమైన క్రిమినల్ జుడిషీయల్ వ్యవస్థ రావాలన్నారు. ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ డాక్టర్ కెఎస్‌రావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని చెప్పారు. అనంతరం 2కె వాక్‌థాన్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బర్త్‌రైట్‌బై రెయిన్‌బో యూనిట్ హెడ్ గుణశేఖర్, డాక్టర్ ఉమ మిక్కిలినేని, డాక్టర్ మను జాస్తి, డాక్టర్ పల్లవి అట్లూరి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో 2కె వాక్‌థాన్ రన్‌లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తదితరులు

నాణ్యమైన ఉత్పత్తుల్లో ఎల్‌జీ నంబర్ వన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కస్టమర్లకు నమ్మకమైన ఉత్పత్తులు అందించడంలో ఎల్‌జీ ఎప్పుడూ ప్రపంచంలో నెంబర్ వన్ గా ఉంటుందని సంస్థ హెచ్ఏ డైరెక్టర్ యూయాంగ్ సబ్‌జీ అన్నారు. ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ విజయ టాకీస్ ఎల్‌జీ నూతన ఉత్పత్తులను బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీ గత 24 సంవత్సరాలుగా ప్రపంచ మార్కెట్లో గృహోపకరణ రంగంలో ప్రజల యొక్క నమ్మకాన్ని పొందుతూ సరికొత్త ఫ్యూచర్స్ ఎయిర్ కండీషనర్లను మార్కెట్లోకి విడుదల చేయడం సంతోషంగా భావిస్తున్నామన్నారు. మార్కెట్‌లో ఏ ఇతర కంపెనీ ఎయిర్ కండీషనర్‌లలో లభించని అత్యాధునిక ఏఐ+ టెక్నాలజీ ద్వారా మానవుని ప్రమేయం లేకుండానే మన చుట్టూ ఉన్న పరిసరాలకు తగినట్లుగా చల్లదనాన్ని అందిస్తుందన్నారు. కన్వర్టబుల్ 6 ఇన్ 1, యూవీ నానో, ప్లాస్ మాస్టర్ అయనైజర్, థింగ్ వైఫై, విరాట్ మోడ్, పీఎం 1.0 సెన్సార్, డిస్‌ప్లే ఓషన్ బ్లాక్ కోటింగ్, యాంటి వైరస్ ప్రొటెక్షన్, ఆటో క్లీన్, గ్రూప్ కాపర్, డీసీ సెన్సార్, లో గ్యాస్ డెటెక్షన్ లాంటి అధునాతన సౌకర్యాలను అందిస్తోందన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతో ఇండియాలో ఉత్పత్తి, వినియోగంలో అగ్రగామిగా ఉందన్నారు. ఎల్‌జీ ఏపీ రీజియన్ బిజినెస్ హెడ్ కెవీ కృష్ణాజీ బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్ బాబు, సోనో విజన్ ప్రొప్రయిటర్ భాస్కరమూర్తి పాల్గొన్నారు.



నూతన ఉత్పత్తులు విడుదల చేస్తున్న దృశ్యం

వీఎంసీ ఆధ్వర్యంలో పింక్ ర్యాలీ



పింక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వీఎంసీ ఆధ్వర్యంలో పింక్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రాఘవయ్య పార్క్ వరకు సైకిలింగ్ – వాక్ కార్యక్రమాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ కార్పొరేటర్లతో కలిసి పావురాలను ఎగరవేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కమిషనర్ మాట్లాడారు. కార్పొరేటర్లు భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డి, పడిగిపాటి చైతన్య రెడ్డి, మైలవరపు రత్నకుమారి, శర్వాణీ మూర్తి, అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్), కె.వి సత్యవతి, డిప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, వీఎఎస్ డాక్టర్ రవిచంద్, డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ టి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకులో....

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర చాలాప్రత్యేకమైనదని కృష్ణా జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. బందరురోడ్డులోని బ్యాంక్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లా సహకార బ్యాంకులో 70 శాతం మహిళలే ఉద్యోగాలు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. అనంతరం పలువురు మహిళా ఉద్యోగులను ఆయన సన్మానించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ సురేష్, బ్యాంకు డైరెక్టర్ పడమట సుజాత, బ్యాంకు జీఎం రంగబాబు, డీజీఎం కాగిత శ్రీనివాస్ , ఏజీఎం వాస్తవి, చీఫ్ మేనేజర్ రాంబాబు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఉద్యోగులను సన్మానిస్తున్న కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

రైల్వే మహిళా ఉద్యోగులకు సత్కారం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ జయమోహన్, ముఖ్యఅతిథిగా డీఆర్ఎం షివేంద్రమోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయమోహన్ మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో 1750 మంది మహిళా ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించడం గర్వకారణం చెప్పారు. లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేసి మహిళలకు ఉన్నత స్థాం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్ఎం షివేంద్రమోహన్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో పురుషులతో సమానంతో అత్యత్తుమ సేవలు అందించిన మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. వివిద విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 20 మంది మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. సీనియర్ డీపీఓ ఎమ్.బాలమురళీధర్, డీపీఓ షాహబాజ్ హనూర్, సీనియర్ డీఈఎన్ ఆర్‌సీ సహా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులతో డీఆర్ఎం షివేంద్రమోహన్, జయమోహన్

భక్తిశ్రద్ధలతో షబేబరాత్ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మసీదుల్లో షబే బరాత్ పర్వదినాన్ని మంగళవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాగారం చేసి స్థానిక మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వించిపేట, ఇస్లాంపేట, తారాపేట తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు షబేబరాత్‌ను పురస్కరించుకొని పోలీసు శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది.

